సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 13 । మార్చి । 2024



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి మెర్ల రాంబాబు, లల్లి సత్యసాయి పద్మజ దంపతులు (వాడపల్లి) మంగళవారం రూ.50 వేల విరాళం అందించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సెహరీ గురు (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.51
కాకినాడ	6.21	4.51
అమలాపురం	6.21	4.51

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టం



ఖురాన్ హాఫీజ్ సల్మాన్‌ను సత్కరిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్

కొత్తపేట: ముస్లిం, మైనార్టీల పక్షపాతిగా బడ్జెట్‌లో ఆయా వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇచ్చి మళ్లీ పట్టం కడదాం.. అని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ పిలుపునిచ్చారు. రంజాన్‌మాసం ప్రారంభం సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మహ్మద్ హరుణ్ మంగళవారం రాత్రి స్థానిక మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ బోర్డు వచ్చాక ఈ మసీదు అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరు చేయించామని, అల్లా ఆశీస్సులతో రాబోయే రోజుల్లో షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చిర్ల జగ్గిరెడ్డిని మళ్లీ గెలిపించుకోవడం ద్వారా సీఎంగా జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు సభ్యుడు మహ్మద్ హరుణ్ కుమారుడు మహ్మద్ సల్మాన్ ఖురాన్ హాఫీజ్ (ఖురాన్ చూడకుండా చదవడం) పై బెంగుళూరులో శిక్షణ పూర్తిచేసి పట్టా పొందారు. ఆయనను స్థానిక ముస్లింలు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ చేతుల మీదుగా సత్కరించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మహ్మద్ యునుస్, స్థానిక మసీదు, షాదీఖానా ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు, అమలాపురం మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు ఖాజా సుల్తాన్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

సాక్షి అమలాపురం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరిగే ఈ పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పరీక్షలను విజయవంతం చేసేందుకు వివిధ విభాగాల నుంచి అధికారులకు విధులు, బాధ్యతలు కేటాయించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు నిర్వహణకు ఐదు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ పరీక్షల నిర్వహణకు 17 కేంద్రాల చొప్పున మొత్తం 22 కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తాగునీరు అందించాలన్నారు.

టీడీపీ వికృత చేష్టకు గీతాంజలి బలి

అమలాపురం టౌన్: టీడీపీ, జనసేన సోషల్ మీడియా మృగాల వికృత చేష్టలకు తెనాలిలో గొల్తి గీతాంజలి చెల్లెమ్మ బలి అయిపోందని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా చేతి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీల ఆన్‌లైన్ వేధింపులతో ఇద్దరి చిన్నారి పిల్లలతో ఉన్న చెల్లెమ్మను వేధింపులతో హింసించి చంపేశారని పేర్కొన్నారు. ఈ మేరకు అమలాపురంలో సూర్యనారాయణమూర్తి మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆ చెల్లెమ్మ చావుకు కారణమైన టీడీపీ సోషల్ మీడియా బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇంటి పట్టా ఇచ్చారని, అమ్మ ఒడి, చేయూత, పింఛన్‌తో తమ కుటుంబం బాగుపడిందని ఓ యూట్యూబ్ చానల్‌కు గీతాంజలి సంతోషంగా చెప్పడమే నేరమైందని ఆయన పేర్కొన్నారు. గీతాంజలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నేడు గోదావరి పాయపై వంతెనకు శంకుస్థాపన

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ఠ నదీపాయపై వంతెన పనులకు బుధవారం ఉదయం శంకుస్థాపన చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెనల్లో భాగంగా దీనికి శంకుస్థాపన చేస్తున్నట్టు ఆయన మంగళవారం ప్రకటనలో తెలిపారు.

ఉరిమే ఉత్సాహంతో..



రామచంద్రపురంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ బోస్



అమలాపురంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, నాయకులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ

సాక్షి అమలాపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో మంగళవారం పండగలా జరిగింది. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో భాగంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఆస్పత్రులలో రోగులకు పాలు,పండ్లు పంపిణీ చేశారు. ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నాడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, బలహీనవర్గాల వారికి రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. రామచంద్రపురం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మండపేట పట్టణం రాజారత్నం సెంటరులో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకలలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు అమలాపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంచిపెట్టారు. రాజోలు నియోజకవర్గం పరిధిలో మలికిపురంలో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త రాపాక వరప్రసాదరావు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. రాజోలులో పార్టీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు కేక్‌కట్ చేసి పంచారు. దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాష్ట్ర పోలీస్ సపక్ తక్రా కోచ్ గౌతమ్‌కు ఎస్పీ శ్రీధర్ అభినందన



కానిస్టేబుల్ గౌతమ్‌ను అభినందిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా, పోలీసు అధికారులు

అమలాపురం టౌన్: ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ చాంపియన్ షిప్ 2024 పోటీలకు సంబంధించి సపక్ తక్రా క్రీడా విభాగంలో అయిదు కాంస్య పతకాలు సాధించిన రాష్ట్ర జట్టు కోచ్, జిల్లా స్పెషల్ పార్టీకి చెందిన కానిస్టేబుల్ యాండ్ర గౌతమ్‌ను ఎస్పీ సునరాపు శ్రీధర్ మంగళవారం అభినందించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ముఖ్య పాత్ర పోషించిన కానిస్టేబుల్ గౌతమ్‌తో పాటు రాష్ట్ర జట్టును ఎస్పీ శ్రీధర్ ప్రశంసించారు. సపక్ తక్రా క్రీడా నైపుణ్యంతో గౌతమ్ క్రీడాకారుడిగా, కోచ్‌గా గత కొన్నేళ్లుగా పలు పోటీల్లో ప్రతిభ చాటారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, ఆర్ఐ (అడ్మిన్) సీతారామ్, ఆర్ఎస్ఐలు దిలీప్ చైతన్య, ఉదయ్ భాస్కర్, ఏసుబాబు రాష్ట్ర సపక్ తక్రా క్రీడా సారధి కానిస్టేబుల్ గౌతమ్‌ను అభినందించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబు

- కలెక్టర్ శుక్లా
- వరుసగా ఐదవ విడత ఓఎన్జీసీ పరిహారం
- 23,458 మంది మత్స్యకారులకు రూ.161.86 కోట్లు

సాక్షి అమలాపురం: జీవనోపాధి కోసం జీవితాలను పణంగా పెడుతున్న మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తినా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఓఎన్జీసీ పైపులైన్ డ్రిల్లింగ్ పనుల వల్ల మత్స్య సంపదకు నష్టం వాటిల్లి జీవనోపాధులు కోల్పోయిన మత్స్యకారులకు వరుసగా ఐదో విడత నష్ట పరిహారాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి మంగళవారం లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. వర్చువల్ విధానంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి కాకినాడ జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు సంబంధించి 23,458 మంది మత్స్యకార లబ్ధిదారులకు రూ.161.86 కోట్లను నష్టపరిహారంగా అందజేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, మత్స్యకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ గంగపుత్రులు అభ్యున్నతికి, వలసలను నివారించడానికి వీలుగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఒక పక్కన మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేయడం, మరోపక్క వారికి చమురు సంస్థల కార్యకలాపాల వల్ల సహజ సిద్ధమైన వేటకు కలుగుతున్న నష్టానికి ఆయా సంస్థల నుంచి పరిహారం ఇప్పించడం చేస్తోందన్నారు. ఓఎన్జీసీ పైపులైను ద్వారా జీవనోపాధులు కోల్పోయిన మత్స్యకారులకు నెలకు రూ.11,500 చొప్పున 6 నెలలకు రూ.69,000 చొప్పున సీఎం జగన్ లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారని కలెక్టర్ శుక్లా తెలిపారు.

కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఏడు సముద్ర తీర మండలాలకు చెందిన 16,408 మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.69 వేలు చొప్పున సుమారుగా రూ.113 కోట్లు మేర నిధులు చెల్లించామన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు వేటకు వెళ్లే మత్స్యకారులు చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. మత్స్య సంపదను గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు వీలుగా రిటైల్ షాపుల వెసులుబాటు కల్పించడం, మత్స్యకార కుటుంబాల వలసలు నివారించేందుకు చేపల వేట నిషేధ సమయంలో వారికి అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు మత్స్యకార భరోసా పథకం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. మత్స్యకారుల వలసలు నివారించేందుకు మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారన్నారు. మత్స్యకారుల వర్గాలకు డీజిల్ పై రూ.9 రాయితీలు ఇవ్వడంతో పాటు, ఆక్వా రైతులకు కరెంటు చార్జీలపై కూడా యూనిట్‌కు రూపాయిన్నర రాయితీతో ప్రోత్సహిస్తున్నట్టు సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్య శైలజ, వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు



ఇమ్మిడివరప్పాడులో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: కార్పొరేట్ బాధ్యత నిధులతో గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం అమలాపురం రూరల్ మండల పరిధిలో పలు గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపన, భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని ఇమ్మిడివరప్పాడు జలజీవన్ మిషన్ నిధులైన రూ. 23.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓహెచ్ఎస్ ఆర్ పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులైన రూ.10 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. అదే గ్రామంలో సీఎస్ఆర్ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. రోళ్లపాలెం గ్రామంలో నరేగా నిధులు రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అదే గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఎస్ఆర్‌కు భూమి పూజ చేశారు. ఇందుపల్లి గ్రామంలో నరేగా నిధులు రూ.23.94 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం -2 భవనాన్ని ఆయన ప్రారంభించారు. పేరూరు గ్రామంలో సచివాలయం -3 లో నరేగా నిధులు రూ. 20 లక్షల అంచనా వ్యయంతో అంబేడ్కర్‌నగర్‌లో కొత్త, పాత కాలనీలో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అదే గ్రామంలో పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం- నరేగా రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పేరూరు గ్రామం లంకతోటలో జలజీవన్ మిషన్ నిధులు రూ.40.90 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అదే గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన వివిధ రోడ్లను ప్రారంభించారు. అదే గ్రామంలో గొల్లలమేరక కుమ్మరి మేరలో రూ.13 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన రోడ్లను మంత్రి ప్రారంభించారు. పేరూరులో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. భట్నవిల్లిలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. భట్నవిల్లి నుంచి వేమవరప్పాడు రోడ్డు నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి, సర్పంచ్‌లు దాసరి అరుణ, రేలంగి దుర్గారావు, తిరుకోటి సూజాత, పందిరి విజయ, మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు సూదా గణపతి, మండల సచివాలయాల కన్వీనర్ చొల్లంగి సుబ్బిరామ్, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

సత్యదేవుని నమూనా ఆలయం వద్ద ప్రసాదం స్టాల్

అన్నవరం: సత్యదేవుని భక్తులకు శుభవార్త. అన్నవరం వద్ద జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపాన విశాఖపట్నం – రాజమహేంద్రవరం వైపు ఉన్న దేవస్థానం స్థలంలో రూ.3.57 కోట్లతో సత్యదేవుని నమూనా ఆలయం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ ఈ నెల 15 నుంచి స్వామివారి గోధుమ నూక ప్రసాదాలు విక్రయించనున్నారు. ఆ రోజు ఈ ప్రసాదం స్టాల్‌ను రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించనున్నారని దేవస్థానం అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం వైపు ఉన్న జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద గోధుమ నూక ప్రసాదం విక్రయిస్తున్నారు. దీనివలన విజయవాడ వైపు జాతీయ రహదారిపై వెళ్లే భక్తులు స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు జాతీయ రహదారిని దాటి ప్రసాదాల కౌంటర్ వద్దకు రావాల్సి వస్తోంది. ఆ క్రమంలో వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక డిగ్రీ కళాశాల వద్ద విశాఖపట్నం – విజయవాడ రహదారిని ఆనుకుని సత్యదేవుని నమూనా ఆలయం నిర్మించడంతో పాటు ప్రసాదం స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు.

బండ భారం తగ్గింది

- గృహావసర వినియోగదారులకు స్వల్ప ఊరట
- డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గింపు
- జిల్లాలో 5.96 లక్షల మందికి ప్రయోజనం



రాయవరం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం మహిళలకు తీపి కబురు అందించింది. గృహావసర గ్యాస్ సిలిండర్ ధర రూ.100 తగ్గిస్తూ నిర్ణయం వెలువరించింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 5,96,200 మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. గతంలో భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ నిర్ణయం స్వల్ప ఊరటనిచ్చింది. ఈ తగ్గింపు తక్షణమే అమల్లోకి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో లబ్ధిని పొందే వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

తగ్గింపు ఇలా..

గృహావసరానికి వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం జిల్లాలో గతేడాది ఆగస్టుకు ముందు రూ.1,132లు ఉంది. రాఖీ పండగను పురస్కరించుకుని దీపం, జనరల్ లబ్ధిదారులకు రూ.200 తగ్గించడంతో ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.932గా ఉంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.100 తగ్గించడంతో ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.832 అయింది. ఉజ్వల లబ్ధిదారులకు ఒక్కో సిలిండర్ ధర రూ.732గా ఉంటుంది. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు వంట గ్యాస్ ధర భారీగా ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతోంది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ సిలిండర్ ధర తగ్గించాలని నిర్ణయించింది. జనరల్ కనెక్షన్ లబ్ధిదారులకు ఇది వరకు రూ.200 సబ్సిడీని అందిస్తుండగా తాజాగా మరో రూ.100 ఇవ్వనున్నట్లుగా ప్రకటించింది. మధ్య తరగతి కుటుంబం సగటున 45 రోజులకు ఒక సిలిండర్ ఉపయోగిస్తుండగా, ఉజ్వల కనెక్షన్‌దారులు మూడు నెలలకు ఒకటి వంతున ఉపయోగిస్తున్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని గ్యాస్ కనెక్షన్ల కనుగుణంగా ప్రతి నెలా సుమారుగా 3.40 సిలిండర్లు వినియోగిస్తున్నట్లుగా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 6,13,580 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం కనెక్షన్లు 2,24,760, ఉజ్వల కనెక్షన్లు 17,320, జనరల్ 3,71,500 ఉన్నాయి. ఉజ్వల పథకం కింద 17,320 కనెక్షన్లకు ఒక్కో సిలిండర్‌కు రూ.400 వంతున సబ్సిడీ ఇస్తే రూ.108,18,800 వినియోగదారులు లబ్ధి పొందే అవకాశముంది. మిగిలిన 5,96,260 కనెక్షన్లకు రూ.100 వంతున సబ్సిడీ ఇస్తే రూ.5,96,260 మేర వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

ప్రభుత్వం నిర్ణయం మేరకు..



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. నూతనంగా తగ్గించిన సబ్సిడీ రేట్లు అమల్లోకి వచ్చాయి. డీలర్లు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రేట్లకు అనుగుణంగా గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు చేయాల్సి ఉంది.

– ఎ.పాపారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి, అమలాపురం

మరింత తగ్గితే బాగుండేది



వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు మరింత ఉంటే బాగుండేది. గతంలో పెంచుకుంటూ పోయి, ఇప్పుడు తగ్గిస్తున్నా పెరిగిన ధరల ప్రకారం మరింత తగ్గింపు ఉండాల్సింది. స్వల్పంగా తగ్గడం కూడా మాలాంటి పేద ప్రజలకు ఊరటనిచ్చింది. సిలిండర్‌పై రూ.100 తగ్గించడం వలన కొంత వరకు ఆర్థిక భారం తగ్గుతుంది.

– సాదా అనురాధ, గృహిణి, రామచంద్రపురం

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

పిఠాపురం: ఈ నెల ఒకటో తేదీన పిఠాపురంలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి మంగళవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పిఠాపురం అడిషనల్ ఎస్సై జి.వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ఏరియాలలో కలెక్షన్ ఏజెంట్లుగా పనిచేస్తున్న గొల్లలమామిడాడకు చెందిన పలక అశోక్‌కుమార్ మార్చి 1వ తేదీన కలెక్షన్ పని చేస్తూ పిఠాపురం మార్కెట్ వద్ద తన మోటారు సైకిల్ డిక్కీలో రూ.1.80 లక్షలు పెట్టి ఎదురుగా ఉన్న షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి మోటారు సైకిల్ డిక్కీలో ఉంచిన డబ్బు కనిపించకుండా పోవడంతో అదే రోజు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పిఠాపురం అడిషనల్ ఎస్సై జి.వెంకటేష్ ఈ కేసులో నిందితులైన అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏజెన్సీ లక్ష్మీపురం కృష్ణదేవిపేటకు చెందిన మాకినీడి కృష్ణ అలియాస్ బాలకృష్ణ, మేకల హరికిరణ్‌ను అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులపై గండేపల్లి, ఏలేశ్వరం, గొల్లప్రోలు, మెహబూబాబాద్ తదితర పోలీసు స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను మంగళవారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో అరెస్టు చేసి కోర్టు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో యువకుడికి ఏడేళ్ల జైలు

– రూ.11 వేల జరిమానా

అంబాజీపేట: బాలికను ప్రేమ పేరుతో వేధించి, ఆ బాలిక ఫొటోలు సేకరించి మార్ఫింగ్ చేసి చంపుతానని బెదిరించిన నేరం రుజువు కావడంతో ఓ యువకుడికి కాకినాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. 2020లో మండలానికి చెందిన చప్పిడి అర్జున్ ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించి, ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదు రావడంతో అప్పటి ఎస్సై ఎస్.కె.జానీబాషా పోక్సో కేసు నమోదు చేశారు. కాకినాడలోని పోక్సో కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు వాదోపవాదాలు అనంతరం నిందితుడు అర్జున్‌కు ఏడేళ్లు జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తున్నట్లు మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఎస్సై జానీబాషాను, సిబ్బందిని ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందించారు.

ఎర్రబస్సు నుంచి ఏసీ వరకు..

- అంచెలంచెలుగా ఎదిగిన ఆర్టీసీ
- ఆధునికతవైపు అడుగులు వేస్తున్న ప్రజా రవాణా సంస్థ
- ఆదరణ పెంచుకుంటున్న ప్రగతి రథచక్రం
- రూ.7కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం


ఆర్టీసీ నడుపుతున్న ఏసీ బస్సు

రాయవరం: ఒకప్పుడు పక్క ఊరికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం ధనికులు, ఎగువ మధ్య తరగతి కుటుంబాలకు మాత్రమే ప్రైవేటు వాహనాలు ఉండడంతో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు. 1932లో నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రారంభించడంతో ప్రజలకు రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి అంచలంచెలుగా రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధి చెందుతూ వచ్చింది. కాలానుగుణంగా వస్తున్న మార్పులను, ఆధునిక పోకడలను ఆర్టీసీ అందిపుచ్చుకుంటూ ప్రయాణికుల అభిమానాన్ని చూరగొంటోంది. జిల్లాల పునర్విభజన జరగక ముందు వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతి రోజూ వేలల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ ప్రజలతో విడదీయలేని అనుబంధాన్ని ఏర్పరచుకుంది.

27 బస్సులతో మొదలు

1932లో 27 బస్సులతో ప్రారంభమైన ఆర్టీసీ ప్రస్థానం దినదినాభివృద్ధి చెందింది. ఆధునిక విజ్ఞానం వేగంగా పెరగడంతో బస్సు పరిమాణం, కెపాసిటీ, వేగం సైతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులకు ప్రారంభంలో సెల్ఫ్ సిస్టమ్ లేకపోవడంతో క్రాంకింగ్ విధానం ద్వారా తిప్పి బస్సును స్టార్ట్ చేసేవారు. ప్రారంభంలో బస్సు వేగం గంటకు 10 కిలోమీటర్లు. అప్పట్లో 100 కిలోమీటర్లు ప్రయాణ సమయానికి 10 గంటల సమయం పట్టేది. తొలుత పెట్రోల్‌తో బస్సులు నడవగా, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో చమురు కొరత ఏర్పడడంతో కొద్ది రోజులు బొగ్గు ఉపయోగించి, ఆవిరి ద్వారా బస్సులు నడిపారు. ఆ తర్వాత డీజిల్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రాగా, సంస్థ కూడా ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించే దిశగా ఆర్టీసీ ప్రయాణిస్తోంది. మొదటి తరం బస్సుల్లో డ్రైవర్, కండక్టర్‌తో పాటు పాటు 17 మంది మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండగా, నేటి బస్సుల్లో బస్సు పరిమితిని బట్టి 36 నుంచి 56 మంది వరకు ప్రయాణించే వీలుంది. నేటి బస్సులు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుండగా, సీట్ల కెపాసిటీ సైతం పెంచారు. బస్సులను ఆధునీకీకరించడంతో విలాసవంతంగా, ఎయిర్ కండిషన్డ్ బసుల్లో సురక్షితంగా ప్రయాణం చేయగలుగుతున్నారు. దూర ప్రాంతాల ప్రయాణానికి పడుకుని వెళ్లే విధంగా ఆర్టీసీని తీర్చిదిద్దారు. ప్రజలకు వాహనాల కొనుగోలు శక్తి పెరిగినప్పటికీ ఆర్టీసీకి ఆదరణ అంతగా తగ్గలేదనే చెప్పాలి. ఆర్టీసీ కూడా ప్రైవేట్ సంస్థలతో పోటీపడుతూ ప్రయాణికులకు మారుతున్న కాలానికి అనుగుణంగా సేవలందిస్తూ ప్రగతి రథచక్రాన్ని పరుగులు తీయిస్తోంది.

టిక్కెట్ టు డిజిటల్ పేమెంట్స్

బస్సుల్లో ప్రయాణించాలంటే టిక్కెట్ ఉండాల్సిందే. గతంలో కండక్టర్లు ప్రత్యేంగా ముద్రించిన టిక్కెట్లను పంచింగ్ చేసి ఇచ్చేవారు. స్టేజిని బట్టి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకుని పంచింగ్ చేసి టిక్కెట్లు ఇచ్చేవారు. ఒక టిక్కెట్‌కు ఆరు చోట్ల పంచింగ్ చేసి ఇవ్వడం అధిక సమయాన్ని తీసుకునేది. ఎన్ని టిక్కెట్లు ఇచ్చారనే లెక్కలను ట్రిప్‌షీట్‌లో నమోదు చేసేవారు. ఈ విషయంలో కండక్టర్లు మానసిక ఒత్తిడికి గురయ్యేవారు. పలు సందర్భాల్లో ఈ చిన్న విషయం ఆదాయంపై సైతం ప్రభావం చూపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రానిక్ టిక్కెట్ మెషీన్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం టిమ్స్(టిక్కెట్ ఇష్యూయింగ్ మెషీన్)తో పాటు డిజిటల్ పేమెంట్లు సైతం ప్రారంభించారు. ఇప్పుడు ఐదుగురికి కలిపి ఒకే టిక్కెట్‌ను ఒకేసారి ఇచ్చే సదుపాయం టిమ్స్‌లో ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికానికి అగ్రస్థానం

ఆర్టీసీ ప్రయాణికుల అవసరాన్ని బట్టి తన గమ్యాన్ని నిర్దేశించుకుంటోంది. భక్తుల మనోభావాలను, ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా ప్రయాణిస్తోంది. ఏటా కార్తీకమాసంలో పంచారామాలకు బస్సులు నడుపుతుండగా, అయ్యప్ప మాలధారణ సమయంలో కేరళ రాష్ట్రంలోని శబరిమలకు కూడా బస్సులు నడుపుతోంది. ప్రతి రోజూ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతోంది. ప్రతి పౌర్ణమికి అరుణాచలం ప్రత్యేక బస్సును నడుపుతున్నారు. ఇటీవల అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో అయోధ్యకు కూడా రావులపాలెం డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఉత్తరాది పుణ్యక్షేత్రం కాశీకి కూడా బస్సును నడుపుతూ ఆర్టీసీ ఆధ్యాత్మికానికి అగ్రస్థానమిస్తూ భక్తుల మనోభావాలను గౌరవిస్తోంది. వివాహాది శుభకార్యాలకు కూడా అద్దెకు బస్సులను నడుపుతూ సంస్థను లాభాల బాట పట్టిస్తున్నారు.

27 బస్సులతో ప్రారంభం

నిజాం పాలిత హైదరాబాద్ రాష్ట్రంలో 1932 వరకు నిజాం రైల్వే రవాణా సంస్థ మాత్రమే ఉండేది. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే ప్రైవేట్ వాహనాల ద్వారా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. కాగా సంస్థాన చివరి పాలకుడైన ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ తల్లి జహీరున్నీసా బేగం కోరిక మేరకు ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బస్సు రవాణా వ్యవస్థను ప్రారంభించారు. నైజాం రైల్వే, రోడ్డు రవాణా సంస్థ పేరిట 1932లో బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బస్సుల తయారీ అంతగా అభివృద్ధి చెందని పరిస్థితుల్లో ఇంగ్లాండ్ నుంచి 27 బస్సులను ప్రత్యేకంగా ముంబై వరకు ఓడల్లో తీసుకువచ్చారు. అక్కడి నుంచి రహదారి మార్గంలో బస్సులు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తల్లి స్మృత్యర్థం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ బస్సుల నంబర్ ప్లేట్లలో తన తల్లి పేరు జెడ్ అక్షరం వచ్చేలా రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.3.71లక్షలతో, 166 మంది ఉద్యోగులతో ప్రారంభమైన సంస్థ నేడు రూ.కోట్లలో ఆదాయం ఆర్జిస్తోంది.


ఆర్టీసీ బస్సు

జిల్లాలో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, ఏలేశ్వరం, తుని, రాజమహేంద్రవరం, గోకవరం, అమలాపురం, రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు డిపోలు ఉండేవి. జిల్లాల పునర్విభన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోలున్నాయి. ఈ డిపోల పరిధిలో 350 బస్సులు ప్రతి రోజు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఇందులో 80 వరకు అద్దెబస్సులున్నాయి. ప్రతి రోజ ఈ బస్సులు 1.25లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రోజుకు 70–75 వరకు ఉంటుండగా, రోజుకు 47 నుంచి 50 లక్షల వరకు ఆదాయాన్ని కోనసీమ జిల్లా ప్రజా రవాణా సంస్థ ఆర్జిస్తోంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకు రూ.7కోట్ల ఆదాయాన్ని ఆర్జించి ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా..



ఆర్టీసీ ప్రయాణికులకు సురక్షితం, సుఖవంతమైన ప్రయాణాన్ని కల్పిస్తోంది. భక్తుల అవసరాలకు అనుగుణంగా దూర ప్రాంతాలకు సైతం బస్సులను నడుపుతున్నాం. లాభార్జనే ధ్యేయంగా కాకుండా ప్రజలకు సేవలందిస్తూ, సౌకర్యకరమైన ప్రయాణాన్ని అందిస్తున్నాం.

– ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, అమలాపురం

ముద్రగడతో పలువురు నేతల భేటీ


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభానికి మద్దతు తెలుపుతున్న అభిమానులు

కిర్లంపూడి: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభం నివాసానికి మంగళవారం స్థానిక జిల్లాలతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కాపు నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివచ్చి మద్దతు తెలిపారు. ప్రతిఒక్కరినీ ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు ఆప్యాయంగా పలకరిస్తూ, వారిని ఆహ్వానించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటనందూరు: అల్లిపూడి కేజీబీవీలో 6వ , 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. రాజేశ్వరి మంగళవారం తెలిపారు. అనాథలు, బడిబయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికా విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్లకు పరిశీలిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం ఇస్తామని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణ విద్యార్థులకైతే రూ. 1.4 లక్షలకు మించకూడదన్నారు. ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియెట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (11వ తరగతి)లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి కొవ్వూరులో ఆగనున్న తిరుపతి–పూరీ ఎక్స్‌ప్రెస్

- ఉదయం 9.02 గంటలకు కొవ్వూరులో హాల్టు
- రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఉద్యమ ఫలితం



కొవ్వూరు: కోవిడ్ నేపథ్యంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ నిలిపివేసిన తిరుపతి–పూరీ ఎక్స్‌ప్రెస్ రైలుకి స్టాప్ ఇస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం నుంచి ఈ ట్రైన్ కొవ్వూరు స్టేషన్ ఆగుతుందని రైల్వే అధిక రులు తెలిపారు. ఉదయం 9.02 గంటలకు స్టేషన్‌కి వస్తుందన్నారు. వారంలో నాలుగు రోజులు పూరి నుంచి తిరుపతి వెళుతుందని, గురు,శనివారం రెండు రోజులు బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి. రాత్రి పూట 10.05 గంటలకు తిరిగి తిరుపతి నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌కి వస్తుందన్నారు. ఈ రైలుకు ప్రయోగాత్మకంగా హాల్టు ఇచ్చారని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని రైల్వే వర్గాలు సూచించాయి. ఈ రైలు నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ మీదుగా తిరుపతి వెళుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. కోవిడ్ తరువాత నిలిపి వేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి పేరుతో గత కొన్ని నెలలుగా స్థానికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. పలు రకాల నిరసనల ద్వారా స్థానికుల డిమాండ్‌ను రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు పూరీ–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టు ఇవ్వడంపై రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యుడు....సకల దేవతలకు ఆహ్వానితుడు


వ్యాఘ్రేశ్వరంలో ఘర్మం యాగాన్ని నిర్వహిస్తున్న పండితులు

అంబాజీపేట: యాగ నిర్వహణలో హవిస్సు స్వీకరించేందుకు ఇంద్రాది దేవతలను ఆహ్వానించేందుకు సుబ్రహ్మణ్యుడు ఎంతో ముఖ్యుడని తిరుమలకు చెందిన శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ వేదిక్ డీన్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర యాజులు తెలిపారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో జరుగుతున్న అగ్నిష్టోమ యాగంలో భాగంగా రెండో రోజైన మంగళవారం యాగ కర్తలైన ఆకెళ్ల వ్యాఘ్రేశ్వర వెంకటరామ సూర్య సుబ్రహ్మణ్య నరసింహ హవిర్యాజిశర్మ, సీతానాగమహాలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య ఆహ్వానం నిర్వహించారు. యాగ హవిస్సును ఇంద్రాది దేవతలు సుబ్రహ్మణ్యుడు ద్వారా స్వీకరించేందుకు, 17 మంది ఋత్విక్కులతోపాటు 18వ ఋత్విక్కుడైన సుబ్రహ్మణ్యుడు ఎంతో ముఖ్యుడని ఆయన వివరించారు. రెండవ రోజు యాగ క్రతువులో భాగంగా ప్రత్యేకంగా 'ఘర్మం' అనే క్రతువు నిర్వహించారు. యాగనిర్వహణకు వేదం, శ్రౌతం అగ్నిహోత్ర పరంపర, సకాల వివాహం తదితర కఠోర నియమాలు ఆచరించిన 17 మంది నిర్వాహకులు ఋత్వికులు అవసరమని, వీరందరితో కలిసి సుబ్రహ్మణ్యుడు 18వ యాగకర్తగా నిర్వహణను కొనసాగిస్తారని యాజులు వివరించారు. ఈ యాగ నిర్వహణ దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు బ్రహ్మత్వంలో, బులుసు రామచంద్రావధానులు, డాక్టర్ ఆకెళ్ల వెంకటేశ్వర్లు, కంచి భక్తులు కొమ్ము దక్షిణామూర్తి శాస్త్రి పర్యవేక్షణలో, ఆకెళ్ల సూర్యనారాయణ అవధాని (మేఘనాథ్), కర్రా సోమ సుందరశాస్త్రి, (దత్తు), ఆకెళ్ల వెంకటనారాయణ అవధాని ఆధ్వర్యంలో కొనసాగుతోంది. యాగాన్ని చూసేందుకు వచ్చిన భక్తులకు బులుసు సుబ్రహ్మణ్యం వ్యాఘ్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు పూటలా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు.

స్కేటింగ్‌లో గొంచాల చిన్నారి ప్రతిభ


స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన చిన్నారిని అభినందించిన దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాలకి చెందిన ఏడో తరగతి విద్యార్థి సామన గంగా హేమంత్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి రెండు రజత పతకాలు సాధించాడు. దాంతో మంగళవారం విద్యార్థి తల్లి సత్య తన కుమారుడిని స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు పరిచయం చేశారు. దాంతో హేమంత్‌ను దొరబాబు అభినందించారు. తల్లి గొంచాల వలంటీరుగాను, తండ్రి వీరబాబు వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. మండల పరిషత్ వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, పవర వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా వీరేశ్వరస్వామి రథోత్సవం

- ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు


ఊరేగింపులో ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి మహాశివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులతో మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, వివిధ రకాల దేవతా మూర్తుల అలంకరణ, బ్యాండ్ మేళాలు, సంగీత విభావరి, కోలాటాలు, గరగ నృత్యాల నడుమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని ప్రత్యేక రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. వృద్ధ గౌతమీ గోదావరి వద్ద ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేదపండితుడు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, ఉండి దత్తు తదితరులు గోదావరి మాతకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పచ్చిపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గోదావరి ఒడ్డున నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లు చేశారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 11వ తేదీతో భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో మంగళవారం తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజలు చేశారు.

నేడు హుండీల లెక్కింపు

మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆదాయం తెలుసుకోవడానికి బుధవారం ఉదయం హుండీలను లెక్కించనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు పర్యవేక్షణలో హుండీలను లెక్కించనున్నారు. మహా శివరాత్రి సందర్భంగా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.9,00,910, లడ్డూల విక్రయం ద్వారా రూ.1,42,815, పులిహోర విక్రయం ద్వారా రూ.1,04,830, సేవలకు రూ.92,517, అన్నదానానికి రూ.5,05,322 లతో కలిపి రూ.17,46,394 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు.

సత్యదేవుని హుండీ లెక్కింపు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన అన్నవరం దేవస్థాన నమూనా షోకేష్ హుండీని మంగళవారం లెక్కించారు. దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. హుండీ ద్వారా రూ.18,725 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సూపరింటెండెంట్ ఏవీవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన క్యాషియర్ బి.రాజేష్, కౌన్సిలర్ నేతల హరిబాబు, రైల్వే ప్రత్యేకాధికారి దేవేంద్రస్వామి, స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్‌జల్ మిత్రల ద్వారా మంచినీరు

న్యాక్ ఉమ్మడి ఉభయగోదావరి,కృష్ణాజిల్లాల జోనల్ అధికారి పి.మురళీధర్


శిక్షణ కార్యక్రమానికి హాజరైన నల్‌జల్ మిత్రలతో మురళీధర్

రాజమహేంద్రవరం రూరల్: జల జీవన్ మిషన్‌లో భాగంగా నల్‌జల్‌మిత్రల ద్వారా హర్‌ఘర్‌జల్ పేరిట ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందిస్తామని నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్స్(న్యాక్) జోనల్ అధికారి పి.మురళీధర్ తెలిపారు. మంగళవారం బొమ్మూరు కలెక్టరేట్ ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నల్‌జల్ మిత్రలకు ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పంపు ఆపరేటరు కోర్సులలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పి.మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంగా గ్రామాల్లో డెవలప్‌మెంట్ కమిటీలలో 11మందిలో ఇద్దరికి నాలుగు అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. గ్రామంలో తలెత్తే మంచినీటి సరఫరా సమస్యలు నల్‌జల్‌మిత్రలు పరిష్కరిస్తారన్నారు. అవగాహనా కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి 36 మంది శిక్షణకు హాజరయ్యారన్నారు. నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు జున్నూరు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు, అనపర్తి ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రవికుమార్, మాస్టర్ ట్రైనర్ మోతా కనకదుర్గ మహాలక్ష్మి పాల్గొన్నారు.